క్లుప్తంగా

నేటి నుంచి ఫస్టియర్ ప్రవేశాలు

పరవాడ: స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 7 నుంచి ప్రవేశాలు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీ తెలిపారు. జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరదలచిన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉచితంగా అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాత భాస్కరరాజుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన దంతులూరి భాస్కరరాజు రూ.లక్ష 116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున ప్రొటోకాల్ సూపరింటెండెంట్ దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంని అధికారులు అందించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.


మే 20న జాతీయ సమ్మె

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు


వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా.. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల నాయకత్వ నిర్మాణ వర్క్ షాప్‌లో ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందన్నారు. కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేలా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. ప్రజల త్యాగాలతో నిర్మించిన స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసీ, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులు ఇలా దేశ ఆర్థిక మూలాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, తొలగింపులు ఆపాలని, ఫార్మా, రసాయన పరిశ్రమలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. వర్క్‌షాప్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.ఎం. శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి. కుమార్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

సింహగిరిపై మంగళవారం జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి రథోత్సవంలో 62వ సారి రథసారథిగా జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు వ్యవహరించనున్నారు. అప్పన్నను ఆరాధ్య కులదైవంగా భావించే జాలర్లు... శ్రీమహాలక్ష్మి అమ్మవారి తరఫున బంధువులుగా స్వామివారి రథాన్ని నడిపే బాధ్యతలను తమ భుజస్కంధాలపై వేసుకుంటారు. విశిష్టమైన ఈ రథోత్సవంలో రథాన్ని నడిపే బాధ్యతలను విజయనగరం సంస్థానాధీశులు వీరికి అప్పగించారు.


అప్పన్న రథం

జన్మజన్మల భాగ్యం..
అప్పన్న రథసారథ్యం

- 62వ సారి అప్పన్న రథసారథిగా జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు
- మంగళవారం జరిగే స్వామి రథోత్సవంలో జాలర్లదే కీలకపాత్ర
- లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా తరలిరానున్న గంగపుత్రులు


స్వామివారి రథ చక్రాన్ని పరిశీలిస్తూ..


రథంలోని బ్రేక్ వీల్ స్టీరింగ్‌ని పరిశీలిస్తున్న కదిరి లక్ష్మణరావు

సింహాచలం: సింహగిరిపై కొలువైన వరాహ లక్ష్మీనృసింహ స్వామివారికి ఏటా చైత్రశుద్ధ ఏకాదశిరోజు రాత్రి వార్షిక కల్యాణోత్సవం జరుగుతుంది. దానికి ముందు సింహగిరి మాడ వీధిలో పెద్ద ఎత్తున రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ రథోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో నగర వ్యాప్తంగా ఉన్న జాలర్లే కీలక పాత్ర పోషిస్తారు. రథోత్సవానికి లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా జాలర్లంతా కుటుంబసమేతంగా సింహగిరికి తరలివస్తారు. రథం నడిపే బాధ్యతలను తమ భుజాలపై వేసుకుంటారు.

సారథ్యం ఆ కుటుంబీకులకే..

కదిరి లక్షణరావు ముత్తాత కదిరి సూర్యనారాయణ, తాత నారాయణ, తండ్రి గవరయ్య స్వామివారి రథోత్సవాల్లో రథసారథి బాధ్యతలు వహించారు. ఆ తర్వాత 1963 నుంచి లక్ష్మణరావు రథసారధిగా వ్యవహరిస్తున్నారు. వీరి కుటుంబాలే అప్పన్న రథ సారథ్యం వహించాలని విజయనగర సంస్థానాధీశుల కాలంలో శాసనం చేశారు.

ముందస్తు ఆహ్వానం

ఏటా రథోత్సవం తేదీని తెలియజేస్తూ దేవస్థానం అధికారులు లక్ష్మణరావుకు ఆహ్వానం అందిస్తారు. ఆ తర్వాత లక్ష్మణరావు విశాఖలోని భీమునిపట్నం, కోటవీధి, గంగవరం, దిబ్బపాలెం, జాలారి ఎండాడ, మల్కాపురం, కొత్త జాలారిపేట, పెద జాలారిపేట తదితర ప్రాంతాల్లో ఉన్న జాలర్లకు సమాచారం చేరవేస్తారు. ఆయా ప్రాంతాల నుంచి జాలర్లంతా రథోత్సవం రోజు సింహగిరికి చేరుకుంటారు. రథసారథిగా లక్ష్మణరావు రథంపై నిలబడి ఇచ్చే సూచనలను పాటిస్తూ రథాన్ని నడపడంలో నిమగ్నమవుతారు. జాకీని తిప్పడం, బొడ్డు బల్ల వేయడం, చక్రాల వద్ద చెక్క చొప్పలు పెట్టి రథం వేగాన్ని నియంత్రించడం, తాళ్లతో రథాన్ని గట్టిగా పట్టుకోవడం, మాడ వీధిలో రథాన్ని మలుపులు తిప్పే పనులు చేస్తారు. ఇంతటి మహద్భాగ్యాన్ని ఇచ్చిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జేజేలు పలుకుతూ ముందుకు సాగుతారు. తమకు మాత్రమే దక్కిన ఈ అవకాశాన్ని తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు. ఏటా రథోత్సవం నిర్వహణలో పాల్గొన్న జాలర్లకు దేవస్థానం బియ్యాన్ని, రసవర్గాలను అందిస్తుంది. దీన్ని వీరు మహాప్రసాదంగా స్వీకరిస్తారు. రథోత్సవం జరిగే వారం రోజుల ముందు నుంచే లక్ష్మణరావు సింహగిరికి చేరుకుని రథాన్ని పరిశీలించే పనులు చేస్తుంటారు. మరమ్మతులపై దేవస్థానం సిబ్బందికి తన వంతు సూచనలిస్తారు. రథ కదలికలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు.

2021లో చిన్న రథంపై..

2020లో కరోనా ఫస్ట్‌వేవ్ కారణంగా ఆ ఏడాది పూర్తిగా రథోత్సవం రద్దయింది. 2021లో సెకండ్ వేవ్ కారణంగా చిన్న రథంపై రథోత్సవం నిర్వహించారు. ఆ చిన్న రథానికి కూడా రథసారథిగా లక్ష్మణరావే వ్యవహరించారు.

తండ్రి అడుగుజాడల్లో చిన్న కుమార్తె

గడిచిన మూడేళ్ల నుంచి లక్ష్మణరావు చిన్న కుమార్తె సౌమ్య కూడా రథోత్సవంలో పాలుపంచుకుంటున్నారు. లక్ష్మణరావుకు నలుగురు కుమార్తెలు. వారిలో ఆఖరి కుమార్తె సౌమ్య తండ్రితో పాటు మూడేళ్ల నుంచి రథోత్సవానికి వచ్చి రథోత్సవ వ్యవహారాలను దగ్గరుండి చూస్తున్నారు. తమ జాలరి కుటుంబీకులతో కలిసి తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. రథోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో తమ వంతు సూచనలు అందిస్తున్నారు.

అంతా ఆ స్వామి అనుగ్రహం



శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారి రథసారథ్య బాధ్యతలను 62వ సారి చేపట్టడం ఆ స్వామి అందించిన అదృష్టంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తా. 1963 నుంచి వరుసగా రథ సారథిగా వ్యవహరిస్తున్నా. ఏటా విశాఖ నగర వ్యాప్తంగా ఉన్న నా జాలరి కుటుంబీకులంతా నాకు అందిస్తున్న సహకారం మరవలేనిది. స్వామివారి అనుగ్రహం ఉన్నంతవరకు రథసారథిగా నా కర్తవ్యం నిర్వహిస్తాను.

– కదిరి లక్ష్మణరావు, అప్పన్న రథసారధి


రథంపై సారథిగా..

శాకాహారంతో ఆరోగ్యం


శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

పెందుర్తి: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందని బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన కేంద్ర ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం పాపయ్యరాజుపాలెం నుంచి పెందుర్తి వరకు శాకాహార ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో ధ్యానాన్ని ఓ భాగంగా చేసుకోవాలని సూచించారు. సాత్వికాహారం, యోగా, ధ్యానంతో చాలా రోగాల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ కేంద్రం ధ్యాన మాస్టర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా ఇన్‌చార్జి వేదుల దక్షిణామూర్తి

సింహాచలం: బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు 98వ వార్డు పరిధి అడవివరంలో ఆదివారం ఘనంగా జరిగాయి. వార్డు బీజేపీ అధ్యక్షుడు రచ్చ ఆనంద శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి వేదుల దక్షిణామూర్తి పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్థానిక నాయకులు అప్పలనాయుడు, సూర్యనారాయణ, శరత్ పాల్గొన్నారు.

పరవాడ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకుడు కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో పరవాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభిప్రసాద్ పార్టీ జెండా విష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నమోబాబు, ముత్యాల అప్పారావు, పిల్లా సతీష్, బి.గోవిందు, బి.కల్పన, కె.సరస్వతి, పి.సత్యారావు, మోసా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెంలోని అంగాల పరమేశ్వరి అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ నాయకుడు గండి రవికుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గెంజి సురేష్, మంత్రి గిరి ప్రసాద్, యడ్ల నాయుడు, ఐడీ బాబు, కరక రాము, గిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


విశేష అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉక్కు దీక్షలకు భెల్ సీఐటీయూ మద్దతు


నినాదాలు చేస్తున్న భెల్ యూనియన్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన 1469వ రోజు రిలే దీక్ష శిబిరంలో ఆదివారం పబ్లిక్ సెక్టార్ యూనియన్ భెల్ ప్రతినిధులు, భెల్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ విషయంలో స్పష్టమైన వైఖరి వెల్లడించడం లేదన్నారు. ఇక్కడ ఉన్న ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపించేసి, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి ప్రైవేటీకరణకు ఆలోచిస్తోందన్నారు. పోరాటంతోనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు.


కోట్నివానిపాలెంలో సీతారాముల కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులు


చినముషిడివాడ శాంతినగర్‌లో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


శారదాపీఠంలో కల్యాణాన్ని పర్యవేక్షిస్తున్న ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి


సీతారాములను దర్శించుకుంటున్న పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు



రాంపురంలో స్వామివారి పల్లకీ మోస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కుటుంబ సభ్యులు


అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

రామాలయం లేని ఊరు చాలా అరుదు. ఎందుకంటే.. శ్రీరాముడు.. మన రాముడు. ఈ భూమిపై మనుషులు ఎలా జీవించాలో ఆచరించి చూపిన పురుషోత్తముడు. అందుకే శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం పెందుర్తి నియోజకవర్గంలోని ఊరూవాడా రామాలయాలే అయ్యాయి. జైశ్రీరామ్.. జైజై శ్రీరామ్.. రామ లక్ష్మణ జానకీ జై బోలో హనుమాన్‌కీ నామస్మరణతో భక్తులు హోరెత్తించారు. సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి పునీతులయ్యారు.

సీతారాముల కల్యాణం..
సకల శుభములకు శ్రీకారం


చింతలగ్రహారంలో కల్యాణ ఘట్టం


పినగాడిలో..

- పల్లకిలో ఊరేగిన జానకిరాములు
- వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- పలుచోట్ల భారీ అన్నసమారాధనలు


తానాంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ దంపతులు


98వ వార్డు పరిధి సింహపురికాలనీలో సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


అడవివరంలోని రాజవీధిలో సీతారాముల కల్యాణోత్సవం


మొగలిపురంలో గండి రవికుమార్ తదితరులు

పెందుర్తి: శ్రీరామనవమి వేడుకలు నియోజకవర్గంలో ఆదివారం ఘనంగా జరిగాయి. వాడవాడలా సీతారాముల కల్యాణ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిపారు. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

➡ శాంతినగర్ సీతారామాలయ 15వ వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించారు. ఉదయం ఎదురుకోలు సన్నాహం చేశారు. సీతారాముల ఉత్సవ మూర్తులకు అభిషేకాలు జరిపి, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. వేద మంత్రాల నడుమ కల్యాణం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం అన్న సమారాధనలో సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

➡ వేంకటాద్రి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిపారు.

➡ చినముషిడివాడలోని శారదాపీఠంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

➡ సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

➡ పెందుర్తి పాతూరులో సీతారాముల కల్యాణం జరిపారు. పల్లకి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

➡ పార్వతినగర్‌లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

➡ రాంపురంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త, సమాజసేవకుడు అన్నంరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. పూజల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష పాల్గొన్నారు.

➡ వేపగుంట రామాలయంలో కల్యాణం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

➡ కోట్నివానిపాలెంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణం జరిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు.

➡ పినగాడి, చినముషిడివాడ, పెందుర్తి రాచ్చెరువు, పురుషోత్తపురం, పెదగాడి, చింతలగ్రహారం ,గొరపల్లి, గవరపాలెం, కరకవానిపాలెం, చీమలాపల్లి తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ఆలయ ప్రాంగణాల్లో భారీ అన్నసమారాధనలు జరిపారు.

పరవాడ: మండలంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పరవాడలోని రామాలయంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు దంపతులు పూజలు జరిపారు. భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. మాజీ సర్పంచ్‌లు చుక్క రామునాయుడు, పైల అప్పారావు, సీహెచ్.ప్రశాంత్ దంపతులు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, పైల పోతినాయుడు పాల్గొన్నారు.

➡ తానాంలో సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు జరిపారు. అన్నసమారాధన చేశారు. మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు పాల్గొన్నారు.

➡ ఈ బోనంగిలో సీతారాములకు ప్రత్యేక పూజలు జరిగాయి. అన్నసమారాధన జరిపారు. సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, బుగిడి రామగోవిందరావు, అట్టా సన్యాసప్పారావు, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

➡ వాడచీపురుపల్లి సీతారాముల ఆలయంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

➡ ముత్యాలమ్మపాలెం శివారు హనుమాన్‌నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో నవమి వేడుకలను ఉత్సవ కమిటీ ఘనంగా నిర్వహించింది.

➡ రావాడ, భర్నికం, పి.బోనంగి, పెదముషిడివాడ, కలపాక, వెన్నలపాలెంలో శ్రీరామనవమి వేడుకలను కనుల పండుగగా నిర్వహించారు.

సింహాచలం: శ్రీరామనవమి వేడుకలను 98వ వార్డు పరిధి రామాలయాల్లో వైభవంగా నిర్వహించారు.

➡ అడవివరంలోని రాజవీధి రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కుటుంబం పాల్గొంది. అన్నసమారాధనకు రూ.11 వేలు, చాకిరేవుకొండలో రూ.3వేలు విరాళం అందించారు.

➡ సింహగిరిపై కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సీతారాముల సన్నిధిలో కల్యాణోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు.

➡ సింహపురికాలనీ రామాలయంలో సింహాచలం దేవస్థానం వేద పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ముప్పిరాల నారాయణమూర్తి పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు హరిప్రసాద్ కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మోహనరావు, అధ్యక్షుడు చిరంజీవిరావు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని మొగలిపురం సీతారాముల ఆలయంలో నవమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉప సర్పంచ్ సిరపరపు వాసు, యడ్ల నాయుడు, ఐడి బాబు, ఎమ్మెల్యే దేముడు, కరక రాము, గురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

➡ బంగారమ్మపాలెం, రాయపుర అగ్రహారం తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. అన్నసమారాధనలు చేశారు.